# జన నిష్టురులు

క్రొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ శంకరనియోగి లంచం పట్టడనీ, చాలా ఖచ్చితంగా వుంటాడనీ, వచ్చిన వార్త తాబేదార్లనే కాక, చీకటు బజారు వాలాలనూ, బస్సు కులస్తులనూ, చివరకు పోలీసు వంశీయులను కూడా అసంతృప్తులను చేసింది.

ఇటువంటి అవ్యర్థునకు అటువంటి వున్నత పదవి ఎలా లభించిందా అని చాలామంది వాపోయారు. కొంతమంది ఆశావాదులు మళ్ళా యిక్కణ్ణుంచి కూడా బదిలీకాకపోతుందా అని గాలిలో మేడలు కట్టుకున్నారు. ప్రజా ప్రతినిధులైన శాసనసభ్యులతో దగ్గర చుట్టరికమో లేక మంత్రులతోనో పరిచయమో వున్న ధనగర్వులు కొందరు “చూస్తాం, చూస్తాం...” అన్నారు.

అయితే ఒకప్పుడు కలక్టర్ గారి దగ్గర పనిచేసి వున్న ఓ గుమస్తా మాత్రం వార్త వినగానే ఓ నిగూఢమైన నవ్వు నవ్వాడు. కానీతీరా అతను వచ్చాక అతని వ్యక్తిత్వంలో క్రొత్తగా ద్యోతకమయ్యే గాంభీర్యం, పంక్చు యాలిటీ మొదలైనవి గమనించేసరికి అతడికి చాలా ఆశ్చర్యం అయింది. ఆలోచించగా యిదేదో రుద్రాక్ష పిల్లి యెత్తనుకున్నాడు. కాని ఆరు మాసాలు గడిచినా యీ రుద్రాక్ష పిల్లి ఒక యెలకనూ పట్టకపోయేసరికి యిదేదో పరిణామం అని అంగీకరించక తప్పింది కాదు. పోతే ఆ పరిణామానికి కారణం అతనికి అవగాహన అయింది కాదు.

ఆలోచించి, ఆలోచించి చివరకు పాత స్నేహితునికొకనికి ఓ ఉత్తరం రాశాడు. ఈ విషయాలన్నీ వ్రాస్తూ యిలా ముగించాడు.

“కలెక్టర్ గారిలో యీ మార్పునకు కారణం కాగల సంఘటన ఏమైనా జరిగిందా? ఈ విషయమై నీ వూహ ఏమై వుంటుంది?... వెంటనే జవాబు”.

వెంటనే కాకపోయినా వారం రోజుల్లో జవాబు వచ్చింది. అందులో–

“.... రెండు సంవత్సరాల క్రిందట భార్య చనిపోయింది. పిల్లలు లేరని నీకు తెల్సు కదూ? – నువ్వు వెళ్ళిపోయాకయినా మళ్ళా సంతానం కలుగలేదు. భార్య పోయాక ఆరు మాసాలు ఒంటరిగానే గడిపాడు. తర్వాత బి.ఎ. అమ్మాయి నొకదాన్ని – నువ్వు చూసే వుంటావు సినీమా స్టారులా వుంటుంది – కట్టుకున్నాడు. తర్వాత అంతా ఒక సంవత్సరమైనాక మనిషి సీదాగా మారిపోయాడు.

అయితే దానికి కారణమేమంటే ఏమనీ చెప్పలేం – కడుపు నిండితే గారెలు చేదు – లేక కాంగ్రెస్ గవర్నమెంటుకు హడిలైనా వుండాలి. తొంభై వంతులు అదే అయివుండాలి. ఎందుచేతంటే ఈమధ్య ఈచుట్టు ప్రక్కల నాలుగు పల్లెటూళ్ళలో ఎయిడెడ్ స్కూళ్ళకు ఒకటోరకం బిల్డింగులు కట్టించి యిచ్చాడు. యేదైనా ‘టర్నుకోటు’ గాడవును...

ఈ వుత్తరం తన సందేహ విషయానికి ఒక స్వరూపమిచ్చిన, క్రొత్త ‘క్యూరియాసిటీ’ ఒకటి లేవదీసింది.

అతడింతవరకూ కలెక్టర్‌గారి భార్యను చూడలేదు. బంట్రోతు వీరాస్వామిని నెమ్మదిగా బాతాఖానీలోకి దింపాడు. ఆరా తీసిన విషయం స్నేహితుడు వ్రాసినదానికి విరుద్ధంగా కానవచ్చింది –

“బంట్రోతుల నెవ్వరినీ దగ్గరకు చేరనివ్వదు. ఎప్పుడూ పుస్తకాలూ, పేపర్లూ ముందేసుక కూర్చుంటుంది. లేకపోతే ఏదో వ్రాసుకుంటూ కూర్చుంటుంది. బహు పీనారి. అంత వున్నప్పటికీ ఓ దర్జా అయిన బట్ట కట్టటం అని, ఒక విందులనీ, ఓ సినిమాలనీ– యిటువంటి వేమీ లేవు. ఎంతసేపూ ఓ తెల్లటి చీర, ఓ తెల్లటి రవికా, తింటే యేవో పళ్ళూ – అవీ చవక మచ్చే – అరటిపళ్ళూ, టమేటోలూ, బత్తాయిలూ, బటాణీలు – పచ్చివే తినేస్తుంది. రోజూ మాత్రం లేడీసు క్లబ్బుకు పోతుంది....

గుమస్తా సాయంకాలం ఆఫీసు నుండి యింటికి వెళ్ళేమార్గం కొన్నాళ్ళు మార్చేశాడు. లేడీస్ క్లబ్బు ప్రక్కనుండి పోతుండేవాడు. చివరికొకనాడు కలెక్టరుగారి కారులో వీరాస్వామి యిచ్చిన చహరాలతో ఓ యువతి యగుపడింది. గంభీర్యవంతమైన అంత చక్కటి మూర్తిని అతడింతవరకూ ఎక్కడా చూడలేదు.

కొన్నాళ్ళ తర్వాత తన పాత స్నేహితునికి ఓ వుత్తరం వ్రాస్తూ ముగించే ముందర వ్రాశాడు.

“.....మా కలెక్టరుగారి భార్య పుట్టినింటి వారి స్థితిగతులను గూర్చి నీకేమైనా తెలుస్తే వ్రాయి...”

దానికి పదిహేను రోజుల తర్వాత జవాబు వచ్చింది. అందులో "– నీ దృష్టి కలెక్టరుగారి మీదేకాక భార్య పైన కూడా పడటంలో ఏదో విశేషం వుండి వుండాలి! అదేమిటో జవాబులో వ్రాయి. నువ్వు అడిగినదానికి జవాబు నాకు తెలియదు. ఒకరిని భోగట్టా చేయగా చెప్పారు. వాళ్ళన్నయ్య యేదో రాజకీయ పార్టీలో వర్కరు కూడా. వివరాలు తెలియవు".

ఈ జవాబు అతణ్ణి కొత్త సందేహాల్లోకి లాగింది – ఈ పరిస్థితుల్లో అమ్మాయికీ, వయసూ వన్నె కూడా లేని కలెక్టరుగారికీ జంట యెలా కుదిరిందా అని! యెంత ఆలోచించినా అతడికీ సమస్య విడింది కాదు.

అయితే యిందులో ఆశ్చర్యమేమీ లేదు. పరిస్థితులన్నీ యింతకన్నా వివరంగానూ సాంగోపాంగంగానూ తెలిసిన చుట్టాలూ, స్నేహితులూ చివరకు అన్నగారే ఈ సమస్యను విప్పలేక పోయారు.

సంబంధం ఏవిధంగా తటస్థిస్తే యేం యీ వివాహం ఇందిర యొక్క సంపూర్ణమైన అంగీకారంతోనే జరిగింది. 'పూర్తిగా ఆలోచించకుండా తొందర పడ్డావేమో' అన్నాడు అన్న. మూడు వందల అరవై కోణాల నుండీ పరిశీలించానంది ఇందిర.

అన్న మాట్లాడలేదు. తల్లిని కూడా అలానే మాట్లాడకుండా చేసింది. చుట్టాలనందరనూ కూడా ఆవిధంగానే నిర్వాక్కులను చేసింది. ఒక వాసు నోటిని మాత్రవే ఆమె బంధించలేకపోయింది.

వాసు, ఇందిరల సంబంధం చెప్పాలంటే వారు పెత్తల్లి, పింతల్లి బిడ్డలనటంకన్నా బాల్య స్నేహితులని చెప్పాలి. సమ వయస్కులు, సహాధ్యాయులు. వాసు చివరి క్షణం వరకూ హోరాహోరీ పోట్లాడాడు. అతని ప్రాతికూల్యతను యెదుర్కోవటానికి ఇందిర సర్వశక్తులనూ పూర్ణంగా వినియోగించవలసి వచ్చింది. చివరకు వాసే ఓడిపోయాడు. యుద్ధంలో పరాజితులెలా రంగం విడిచి పారిపోతారో వాసు కూడా అలానే పరారి అయిపోయాడు. రేపు వివాహం అనగా ఆ రాత్రి యెవరో స్నేహితునకు జబ్బుగా వుందంటూ బండెక్కేశాడు.

"... ఆమధ్య మనం ఒక విషయం చర్చించాం. 'ఒకప్పుడు కాంగ్రెస్ సంస్థ కోసరం, ప్రజల కోసరం, తమ సర్వస్వం ధారవోసిన త్యాగులు యీనాడీ విధంగా యెందుకు మారిపోయారా?' అని. కారణం యీనాడు బోధపడింది.

కాని ఇందూ! నువ్వు స్వార్ధానికి సుళువుగా లొంగిపోతావని యెన్నడూ అనుకోలేదు.

ఇందిర – దేశంలోనూ సమాజంలోనూ విప్లవాగ్ని జ్వలించాలంటూ, అది స్త్రీల హస్తాలలోనే సులభసాధ్యమంటూ, సామాజిక సేవా విధిని నిర్వర్తించలేని విద్యాధికులు శుష్క జీవితాలను గడిపేకన్నా ఆత్మహత్య చేసుకోవటం యెంతైనా నయమనీ – వేదికలెక్కి ఉపన్యసించిన – శ్రీమతి ఇందిరాదేవి – సామాజికోద్ధారణకై ఎన్నెన్నో రాత్రులు నిద్రా శూన్యంగా గడిపిన మా ఇందూ – చివరకు ఒక దేశ ద్రోహిని, లంచగొండి – కిరాతకుని, తన బాధ్యతను వీసమంతైనా గుర్తించని ప్రజాద్రోహిని, తెల్లవాళ్ళ బూట్లు నాకటాని కలవాటు పడ్డవాడిని, అధికార ధన గర్వాంధుని, రూప వయో ప్రాభవ రహితుని, తన జీవన సహచరునిగా ఎన్నుకొనే నైచ్యానికి పతనమౌతుందని ఎవ్వరూ వూహించనైనా వూహించి వుండరు.

"ఈ వుత్తరం నిన్ను బాధిస్తుందని తెలుసు – నేకోరేది అదే. నా హృదయం అంతగా మండుతోంది".

ఇందిర వుత్తరం చదవటం అయిన తర్వాత ప్రతి అక్షరం జాగ్రత్తగా గమనించింది. నాలుగయిదు నీటిబొట్లు ఉత్తరం మీద పడిన జాడలు స్పష్టంగా తెలియవస్తున్నాయి. ఓ శుష్క హాసం చేస్తూ ఉత్తరం మడిచి తన గదిలో మంచం మీద ఆనుకు కూర్చుంది. కాని ఒక్క నిమిషంలోనే ఆమె నిగ్రహం హరించుకపోయింది. తలగడలో తలదూర్చి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఏమైతేం ఇందిర వివాహం అయిపోయింది. నాటికీ నేటికీ ఆ యిద్దరి మధ్యా కనీసం ఉత్తర ప్రత్యుత్తరాలయినా లేవు. అయినా వాసుని గురించి ఏ సమాచారం కావలసినా ఇందిరను అడుగుతే తెలుస్తుంది. అతని తత్వం గురించి ప్రశ్నిస్తే ఓ సుదీర్ఘమయిన నిట్టూర్పు విడిచి చెప్పుతుంది.

"చాలా సున్నితమైన హృదయం. నాకు వాడికన్నా అభిమాన పాత్రులు లేరు. కాకపోతే వాడి రక్తంలో కాస్త అసామాన్యమైన కాక కానవస్తుంది".

అలానే ఆమెను గూర్చిన ఏ సమాచారమడిగినా వాసు చెపుతాడు. ఆమె తత్వం గురించి మాత్రం ఏమీ చెప్పడు.

అంతగా చెప్పవలసి వస్తే చిన్నప్పట్నుంచి చూస్తున్నాను కాని యిప్పటివరకూ ఆమెను అర్థం చేసుకోలేక పోయాను. యేదియేమైనా ఇందిర ఇందిరే.

చెప్పవచ్చేదేమంటే – అందరికంటే సన్నిహితులైన వారికి ఆమె విషయం ఒక సాధించరాని సమస్యగా నిల్చింది. అటువంటప్పుడు ఏమాత్రం పరిచయం లేక ఆ గుమస్తా తలా తోకలను కనిపెట్టలేక పోయాడనటంలో వింత లేదు.

అయితే మార్పునకు కారణం గ్రహించలేకపోయినా అతడు మార్పును మాత్రం స్పష్టంగానే గుర్తిస్తున్నాడు.

'రుద్రుడు ప్రత్యక్షమవుతారన్నా కలెక్టరుగారు పదకొండు అవందీ ఆఫీసుకు రారు. అయిదూ అయాక క్షణం ఆగరు. పనిలో లోపాన్ని క్షమిస్తారు. కాని ప్రవర్తనలో లొసుగును వీసం క్షమించరు. అవసరమైతే ఏ చిన్న ఉద్యోగయినా ఎదరబడి నిస్సందేహంగా మాట్లాడవచ్చు'.

ఈ ధోరణిని నలుగురు తాబేదార్లూ నాలుగు విధాలుగా విమర్శించారు.

అయితే యెవ్వరూ గుర్తించని విశేషాలింకా వున్నాయి.

'బస్సుల్లో పదియేడుగురో యిరవై మందో – నిర్ణయింపబడిన వారు ఒక్క మనిషి కూడా యెక్కువ కానరావటం లేదు. పోలీసువారు కూడా టిక్కెట్లిచ్చే బస్సు ప్రయాణాలు చేస్తున్నారు. తాలూకాఫీసు షరాబులు కూడా నిష్కామంగానే ప్రజల పనులు చేసి పెడుతున్నారు...'

ఈ వింత మార్పులు ప్రజాసామాన్యం గుర్తించలేదు. గుర్తించిన కొద్ది మంది యిదిప్రజా ప్రభుత్వపు ధాటు అనుకున్నారు.

అయితే సత్యం దాగదు. బయటపడి తీరుతుంది. ఎప్పుడూ అంటే అర్ధ బలిమి కల అసాధ్య సాధకుల భగీరథ ప్రయత్నాలు సఫలమైన నాడు, ఆనాడు బయలుపడుతుంది – క్రమ గతి గోల్పోయిన ఈ గడియారం ఏ చక్రం వలన సక్రమ గతిలో పడిందో. కాని ఆ చక్రంను సక్రమ గతికి తీసుకవచ్చిన శక్తిని మాత్రం ఎన్నడూ గుర్తించలేరనే చెప్పాలి.

★

*(ప్రజాబంధు: 14 మార్చి, 1948)*